andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.6 । కనిష్ఠం 26.7
నిర్మల్ జిల్లా వార్తలు
10
గురువారం 13 జూన్ 2024





జిల్లా కేంద్రంలో టీడీపీ సంబురాలు

నిర్మల్ కల్చరల్, జూన్ 12 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేసిన సందర్భంగా జిల్లాకేంద్రంలో బుధవారం టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు సిరికొండ రమేష్, ఉపాధ్యక్షుడు ఎస్.భీమ్ రెడ్డి, మామడ మండల అధ్యక్షుడు షైక్‌మౌలానా, గఫూర్, కిషన్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



వరదలొస్తే.. పరుగులేనా?

- ఇంకా పూర్తవ్వని కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు
- పనులు పూర్తయ్యేందుకు మరో పది రోజులు పట్టవచ్చని అధికారుల అంచనా
- ఇంకా పెండింగ్‌లోనే 'స్పిల్ వే' సీసీ నిర్మాణ పనులు
- రెండవ నెంబర్ గేటుకు ఇంకా కౌంటర్ వేటు బిగింపు పూర్తికాని వైనం
- జూన్ రెండవ తేదీ కల్లాపనులు పూర్తి చేయాలని అప్పట్లో అధికారుల ఆదేశం
- భారీ వర్షాలు కురిస్తే గత పరిస్థితి పునరావృతం అవుతుందని స్థానికుల ఆందోళన

ఖానాపూర్, జూన్ 12 : కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనుల నిర్వహణ తీరులో ఆశించిన స్థాయిలో వేగం కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేస్తామని అధికారులు చేస్తున్న ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రాజెక్టు దెబ్బతిన్న నాటి నుంచి మరమ్మతు పనుల నిర్వహణ ప్రారంభమయ్యే వరకు ఎన్నో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒక దశలో గత ప్రభుత్వం ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు నిధులను విడుదల చేయడంలో జాప్యం చేసింది. దీంతో వరుసగా రెండేళ్ల పాటు కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారాయి. ఆ తర్వాత ఏర్పడిన కొత్త ప్రభుత్వం కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు నిర్వహించేందుకు రూ.5.46 కోట్ల నిధులను మంజూరు చేసింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన తర్వాత అధికారులు టెండర్లు పిలిస్తే కనీసం టెండర్లు వేసేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఎట్టకేలకు అధికారులు రీటెండర్ పిలిచాక ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు చేసేందుకు మూడు కంపెనీలు టెండర్లు వేశాయి. ఈ రీటెండర్‌లో పనుల నిర్వహణకు టెండర్లు దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన ఓ ఏజెన్సీ పనులను అగ్రిమెంట్ చేసుకొని పనులను ప్రారంభించింది. పనులు ప్రారంభమైన తర్వాత కూడా ఆశించిన స్థాయిలో వేగంగా పనుల నిర్వహణ జరగడం లేదని క్షేత్రస్థాయిలో పరిస్థితిని చూస్తే అర్థమవుతుందని పలువురు చెబుతున్నారు. ఒక దశలో మే నెలాఖరు వరకు పనులు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు మళ్లీ జూన్ రెండవ తేదీ లోపు పనులు పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్రస్తుతం జూన్ 12వ తేదీ వరకు కూడా ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు ఇంకా పూర్తికాకపోవడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇంకా పూర్తవ్వని గేట్ల మరమ్మతు, ఎలక్ట్రికల్ పనులు

కడెం ప్రాజెక్టు మరమ్మతులు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ. 5.46 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద రూ. 3.77 కోట్ల నిధులతో ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు, రూ.1 కోటి నిధులతో ప్రాజెక్టు వద్ద సీసీ పనులు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కడెం ప్రాజెక్టు వద్ద నిర్వహిస్తున్న గేట్ల మరమ్మతు పనులు నెమ్మదిగా సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకా ప్రాజెక్టు వద్ద రెండవ నెంబర్‌గేటుకు కౌంటర్ వేట్ బిగింపు ప్రక్రియ పూర్తి కాలేదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇంకా ఒకటో నెంబర్ గేటు, రెండవ నెంబర్‌గేటు, మూడో నెంబర్‌గేటు పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు ఒకటో నెంబర్‌గేటును బుధవారం ట్రయల్ చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మిగతా 15 గేట్ల తాలూకు పనులు పూర్తి చేసినట్లు చెబుతున్నారు. కడెం ప్రాజెక్టుకు ఉన్న 18 గేట్ల నుంచి ఇప్పటి వరకు 9 ఇండియన్ గేట్లలో రబ్బర్ సీల్స్, బేరింగ్స్ మార్పిడి పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మరో 9 జర్మన్ గేట్లలో సైతం రబ్బర్ సీల్స్ మార్పిడి పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎలక్ట్రికల్ విభాగంలో నిర్వహించాల్సిన పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాజెక్టు ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించి 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు పూర్తిచేసి ఉపయోగానికి సిద్ధంగా ఉంచామని మరో 500ల కేవీల కెపాసిటీ గల కొత్త ట్రాన్స్‌ఫార్మర్ సైతం ప్రాజెక్టు వద్ద సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు వద్ద ఇప్పటికే ఉన్న రెండు జనరేటర్లలో ఒకటి పాతది కావడంతో కొత్త జనరేటర్‌ను అందుబాటులో ఉంచేందుకు హైదరాబాద్ నుంచి 100 కేవీ కెపాసిటీ గల జనరేటర్‌ను అందుబాటులోకి తెస్తామని ఆ జనరేటర్ ఇంకా అందుబాటులోకి రాలేదని అధికారులు చెబుతున్నారు.

ఇంకా పూర్తి అవ్వని 'స్పిల్ వే' మరమ్మతులు

గత రెండేళ్లుగా వర్షాకాలంలో వచ్చిన భారీ వరదలకు ప్రాజెక్టు ప్రమాద ఘంటికలు మోగించింది. ఒక దశలో ప్రాజెక్టు కెపాసిటీకి మించి వరద నీరు రావడంతో గేట్లలో నీరు పట్టక ప్రాజెక్టు పైనుండి వరద పొంగిపొర్లింది. దీంతో ప్రాజెక్టు వైపు చూస్తే అంతా జలమయంగా కనిపించడంతో ప్రాజెక్టు కట్ట కొట్టుకుపోయిందని అంతా భావించారు. ఈ దశలో అంతటి భారీ వరదలను సైతం తట్టుకొని నిలిచిన కడెం ప్రాజెక్టు స్పిల్‌వే కొన్ని చోట్ల దెబ్బతింది. దీంతో కడెం ప్రాజెక్టు స్పిల్‌వే మరమ్మతుల కోసం, ప్రాజెక్టు వద్ద దెబ్బతిన్న ఇతరత్రా సీసీ పనుల కోసం కోటి రూపాయలతో పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనులు సైతం నత్త నడకన సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రాజెక్టులోకి వరద నీరు వస్తే స్పిల్‌వే మరమ్మతు పనుల నిర్వహణకు ఆటంకం కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దశలో ఇంకా స్పిల్‌వే మరమ్మతు పనులు పెండింగ్‌లో ఉండడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాలొస్తే ఉరుకులు పరుగులు తప్పేనా ?

రెండేళ్లుగా వర్షాకాలం వచ్చిందంటే చాలు ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో వార్తల్లోకెక్కడం రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాలతో క్షేత్రస్థాయిలో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టడం చాలా మామూలుగా మారింది. అధికారులు ఉరుకులు పరుగులు పెట్టడమే కాకుండా ప్రాజెక్టు గేట్ల నిర్వహణ తీరులో లోపంతో వచ్చిన వరదలను గేట్ల ద్వారా బయటికి పంపే సమయంలో గేట్లు మొరాయించడంతో స్థానిక ప్రజలను సైతం ఉరుకులు పరుగులు పెట్టించారు. ప్రాజెక్టు గేట్లు అవసరమున్నప్పుడు పైకి ఎత్తేందుకు ఆ తర్వాత కిందకు దించేందుకు అనుకూలంగా ఉంటే ప్రాజెక్టు వద్ద వరద తీవ్రత ఎంత వచ్చినా పరిస్థితి ప్రమాదకరంగా మారదని స్థానికులు చెబుతున్నారు. ప్రాజెక్టు గేట్ల నిర్వహణ తీరులో లోపంతోనే గత రెండేళ్ల ప్రాజెక్టు ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చిందని చెబుతున్నారు. ఇప్పటికైనా భారీ వర్షాలు కురిసి వరద నీరు ప్రాజెక్టులోకి చేరకముందే గేట్ల మరమ్మతు పనులను పూర్తి చేయకపోతే తిరిగి గత రెండేళ్లుగా అనుభవించిన ఉరుకులు పరుగుల జీవితమే పునరావృతం కాక తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ రెండవ తేదీ వరకే పనులు పూర్తి చేయాలని అల్టిమేటం జారీ చేసిన అధికారులు జూన్ 12వ తేదీ దాటిన ఇంకా పనులు పూర్తయ్యేందుకు పది రోజుల సమయం పడుతుందని చెబుతున్నారు. పనులు పూర్తి చేయడంలో జరుగుతున్న ఈ జాప్యంతో స్థానికుల మదిలో ఏదో మూలన మళ్లీ కడెం ప్రాజెక్టు ఈ ఏడాది కూడా ప్రమాదగంటికలు మోగిస్తుందేమోననే ఆందోళన కనిపిస్తుందని చెబుతున్నారు.

ఈ వానాకాలం పంట పైన ఆయకట్టు రైతుల ఆశలు

గత రెండేళ్లుగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాజెక్టు మరమ్మతులకు నోచుకోకపోవడంతో రెండేళ్లుగా కడెం ప్రాజెక్టు కింది ఆయకట్టు రైతాంగం పంటలకు దూరమవుతోంది. ఇప్పటికే గత రెండేళ్లుగా పంటలకు దూరంగా ఉంటున్న కడెం ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగం ఈ ఏడాదైనా వానాకాలం పంటను పండించుకోవాలనే ఆశతో ఎదురుచూస్తున్నారు. కడెం ప్రాజెక్టు మరమ్మతులు శరవేగంగా పూర్తి చేసి వానాకాలం పంటకు నీటిని అందించాలని ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగం కోరుతోంది. నిర్మల్, మంచిర్యాల జిల్లాలలో అధికారికంగా 60,000 ఎకరాలకు సాగు నీటిని అందించే కడెం ప్రాజెక్టు కింద అనధికారికంగా మరో నలభై వేల ఎకరాల వరకు సైతం వ్యవసాయ భూములు సాగవుతున్నాయని చెబుతున్నారు. ఈ దశలో కడెం ప్రాజెక్టు మరమ్మతులు త్వరగా పూర్తి చేయకపోతే ఈ వానాకాలం పంటను సైతం కోల్పోవాల్సి వస్తుందని ఈ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో పదిరోజుల్లో ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతుండడంతో ఈ వానాకాలం పంటపై కడెం ఆయకట్టు రైతాంగం ఆశగా ఎదురుచూస్తోంది.

పది రోజుల్లో ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు పూర్తి చేస్తాం

భోజదాస్, డీఈఈ, కడెం ప్రాజెక్టు



కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు మరో 10 రోజుల్లో పూర్తి చేస్తాం. మెజారిటీ పనులు పూర్తయ్యాయి. ఒకటి, రెండు, మూడో నెంబర్ గేట్లు మినహా మిగతా గేట్ల మరమ్మతులు పూర్తయ్యాయి. రబ్బర్ సీల్స్, బేరింగ్‌ల మార్పిడి పూర్తిచేసి ప్రస్తుతం ఎలక్ట్రికల్ పనులు నిర్వహిస్తున్నాం. స్పిల్‌వే మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపడతాం.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఆర్డీవో



పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఆర్డీవో, డీఈవో

నిర్మల్ కల్చరల్, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తోందని ఆర్డీవో రత్నకల్యాణి అన్నారు. బుధవారం ఈద్గాం హైస్కూల్ నూతన విద్యాసంవత్సర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడిపిల్లలకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం అనేక వసతి సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. బడిబాటలో భాగంగా ఆర్డీవో సమక్షంలో నలుగురు విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఇప్పటి వరకు 44 మంది కొత్తవారిని పాఠశాలలో చేర్పించినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. నూతన కంప్యూటర్ ల్యాబ్ ఆర్డీవో ప్రారంభించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో శంకర్, స్వయం సహాయక సంఘాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమన్వయ కృషి అవసరం'

నిర్మల్ కల్చరల్, జూన్ 12 : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని శాఖల అధికారుల సమన్వయ కృషి అవసరమని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.స్వదేశ్ పేర్కొన్నారు. బుధవారం బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో 1986 బాల కార్మిక నిషేధ నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాలకు చెందిన ప్రతిభ గల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో బాల కార్మికులుగా పని చేస్తున్నవారు ఎందరో ఉన్నారన్నారు.

నిబంధనలను విస్మరిస్తున్న ఆసుపత్రులపై చర్యకు డిమాండ్



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, జూన్ 12 : జిల్లాకేంద్రంలో నిబంధనలను విస్మరిస్తూ పని చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి బుధవారం సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. ఓ పిల్లల వైద్యుడు మందులకు ఎలాంటి బిల్లు ఇవ్వకుండా ఆసుపత్రి నడుపుతున్నాడని ఆరోపించారు. ధనార్జనే ధ్యేయంగా నిర్వహించే ఆసుపత్రిని తనిఖీ చేసి చర్య తీసుకోవాలని కోరారు. నాయకులు డి. నూతన్‌కుమార్, తిరుపతి, నర్సయ్య పాల్గొన్నారు.

అందుబాటులో సోయా విత్తనాలు



రైతులకు సోయా విత్తనాలు అందజేస్తున్న చైర్మన్

ముథోల్, జూన్ 12 : ప్రాథమిక సహకార సంఘం (బిద్రెల్లి హెచ్‌క్యూ) ముథోల్ నందు సోయా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ తీగల వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఆసక్తి గల రైతులు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో 30 కిలోల సోయా విత్తనాల బ్యాగు రూ. 2,100 చెల్లించి తీసుకోవాలని కోరారు. అలాగే కాంప్లెక్స్ ఎరువులు, యూరియా కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు

● మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాల బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ఖానాపూర్, జూన్ 12 : ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించేలా ప్రతీ ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన నిర్వహించడమే కాకుండా ఉచితంగా ఏకరూప దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలను అందజేస్తున్నామన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం మధ్యాహ్న భోజనాన్ని నిర్వహించడమే కాకుండా ఉపకార వేతనాలను అందజేస్తూ ప్రతి విద్యార్థి చదువుకునేలా ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కటి విద్యాబోధన చేస్తున్నారని అభినందించారు. గత పదవ తరగతి ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించిన నలుగురు విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ప్రతి విద్యార్థి తోటి విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. భవిష్యత్తు రోజులలో ట్రిపుల్ ఐటీ, ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం హాజరు నమోదయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో పనులను పరిశీలించి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను, పాఠ్య పుస్తకాలను కలెక్టర్ తన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంపీపీ అబ్దుల్ మోహిద్, వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సునీతతో పాటు స్థానిక ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



బడి బాట కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

● అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, జూన్ 12 : జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం పంచాయతీరాజ్, వైద్యశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ముందస్తు చర్యలు చేపట్టాలని, రోడ్లు, డ్రైనేజీలలో, ప్రధాన కూడళ్లల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. డెంగ్యూ, మలేరియా, అతిసార, అమీబియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. క్లోరినేషన్ చేపట్టిన తరువాతే మంచినీటి సరఫరా చేయాలని సూచించారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. తడి, పొడి చెత్త వేరువేరు సేకరించాలని వారానికి రెండు రోజులు డ్రైడే పాటించాలన్నారు. ఆశా, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శులకు, అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ నెల 12 నుండి 19 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. మిషన్ భగీరథ సర్వే త్వరగా పూర్తికి ఆదేశించారు. డీపీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో గోవింద్, వైద్యాధికారి ధనరాజ్, డీఆర్డీవో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సత్వర చికిత్స అందించాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, జూన్ 13 : ఆసుపత్రి వచ్చే రోగులకు కాలయాపనకు తావులేకుండా సత్వర చికిత్సలు అందించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ భైంసా ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులకు సూచించారు. బుధవారం ఇక్కడి ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులలో పర్యటించి అక్కడి వార్డులలో ఇన్‌పెషెంట్లుగా చికిత్సలు పొందుతున్న రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి జరుగుతున్న అధునీకరణ పనులను పర్యవేక్షించారు. టీకాలు, ల్యాబ్ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి వైద్యాధికారులతో మాట్లాడి రోగులకు మెరుగైన రీతిలో వైద్య సేవలు అందించాలన్నారు. డ్యూటీ వైద్యధికారులు రౌండ్ ది క్లాక్ అందుబాటులో ఉండాలని సూచించారు. విధుల నిర్వాహణలతో ఎంత మాత్రం నిర్లక్ష్యం సహించబోని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని వెల్లడించారు. అనంతరం పీప్రి కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, యూనిఫామ్స్‌లను పంపిణీ చేశారు. ఇందులో భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్ మున్సిపల్ కౌన్సిలర్లు చందులాల్ ,గౌతం పింగ్లే, మున్సిపల్ ఇంచార్జీ కమీషనర్ సుదర్శన్ రెడ్డి, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంఈవో సుభాష్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.వీ.రమణరావ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధులు ఎనుపోతుల మల్లేశ్వర్, సోలంకే భీంరావ్, తూమెల్ల దత్తుతో పాటు పలువురు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలు పరిష్కరించండి

ముథోల్, జూన్ 12 : అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం ముథోల్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో త్రాగునీరు, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో గల పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడైనా మేజర్ సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు మండలాల వారీగా సంబంధిత నివేదికను అధికారులకు అడిగి తెలుసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

స్కూల్ యూనిఫామ్‌ల పంపిణీ



పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూనిఫామ్ అందజేస్తున్న ఎంఏవో

దిలావర్‌పూర్, జూన్ 12 : మండల కేంద్రంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలకు బుధవారం స్కూల్ యూనిఫామ్‌ను మండల విద్యాధికారి కే. శంకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అజీజ్ ఖాన్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదానంద్, అరుంధతిదేవి, అబ్దుల్‌అహ్మద్, ఉపాధ్యాయులు, ఐకేపీ ఏపీఎం సులోచన, సీసీ పోశెట్టి, వీవో, ఓటీ, వీవోఏలు కళావతి, ఇందిరా, గంగామణి పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాల్లో అన్యాయం

నిర్మల్ కల్చరల్, జూన్ 12 : బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు బుధవారం నిర్వహించిన లక్కీ డ్రాలో ఆదివాసీ తెగలకు అన్యాయం జరిగిందని ఆదివాసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంక గారి భూమేష్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఒకే తెగకు చెందిన 22 విద్యార్థులను ఎంపిక చేయడంతో అధిక జనాభా గల ఆదివాసి, నాయక్‌పోడ్ తెగలకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ప్రవేశ ప్రక్రియ పునఃసమీక్షించి న్యాయం చేయాలని కోరారు. లేనట్టయితే ఉద్యమం చేపట్టేందుకు వెనుకాడమని స్పష్టం చేశారు.

తాగునీటి కనెక్షన్ వివరాల సేకరణ

సారంగాపూర్, జూన్ 12 : మండలంలోని ఆయా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు త్రాగునీటి కనెక్షన్ వివరాలను బుధవారం గ్రామస్థాయి అధికారులు ఇంటింటా తిరుగుతూ త్రాగునీటి నల్లా కనెక్షన్ వివరాలను నమోదు చేశారు. నమోదు చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో సంబంధిత అధికారులకు వెంటది వెంటనే పంపించడం జరుగుతుందని తెలిపారు.

భైంసా రూరల్ సీఐగా నైలు బాధ్యతల స్వీకరణ



భైంసా రూరల్, జూన్ 12 : భైంసా రూరల్ నూతన సీఐగా నైలు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కుబీర్, కుంటాల, భైంసా రూరల్ ఎస్సైలు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదన్నారు.

సర్వసభ్య సమావేశానికి

అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

● పెండింగ్ బిల్లులపై పంచాయతీరాజ్ జేఈ నిలదీత

జైనథ్, జూన్ 12: రైతు వేదిక భవనంలో జైనథ్ ఎంపీపీ గోవర్ధన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి సగానికిపైగా అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ జేఈ హరీష్ ఎన్ఆర్ఈజీఎస్, ఎస్డీఎఫ్ పనులపూర్తి వాటి బిల్లులపై మాట్లాడారు. దీంతో గిమ్మా ఎంపీటీసీ సభ్యులు కోలభోజన్న, బోరజ్ ఎంపీటీసీ కట్కుర్ల మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తాము ఇతరుల దగ్గర వడ్డీకి తెచ్చి గ్రామాల్లో పనులు చేస్తున్నామన్నారు. దీనిపై సకాలంలో ఎంబీ రికార్డులు చేయలేదని, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇందులో పనులు పూర్తి అయిన ఎన్ఆర్ఈజీఎస్ పెండింగ్ బిల్లులు రూ.480 కోట్ల ఉండగా ఎస్డీఎఫ్ పనులకు సంబంధించిన బిల్లులు లక్షల్లో ఉన్నాయని ఎంపీటీసీలు వాపోయారు. సమావేశంలో జైనథ్ మండల జడ్పీటీసీ టి. అరుంధతి వెంకట్‌రెడ్డి, జైనథ్ మండల ప్రత్యేకఅధికారి సాంబశివరావ్, మండల ఉపాధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్, జైనథ్‌ఎంపీడీఓ రవీంద్రనాథ్,జైనథ్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, తదితరులున్నారు.

కబ్జా స్థలంపై అధికారుల విచారణ


విచారణ చేపడుతున్న త్రిమెన్ కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌అర్బన్,జూన్12: కైలాస్‌నగర్ కాలనీలో కబ్జాకు గురైన స్థలంపై జిల్లా కలెక్టర్‌కు కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో అధికారులు కదిలారు. బుధవారం ఆదిలాబాద్‌ఆర్డీవో జీవాకర్‌రెడ్డి,తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్ త్రిమెన్ కమిటీ విచారణ చేపట్టారు. సదరు వ్యక్తి వద్ద పత్రాలున్నాయని చెబుతున్న అధికారుల ముందుకు రాలేదన్నారు. స్థలానికి సంబంధించిన పత్రాలను చూపాలని ఆర్డీఓ ఆదేశించారు. అనంతరం కైలాస్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లోకప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని, భూమాఫియా దాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిందన్నారు. ఇందులో దుర్గం శేఖర్, పలువురు కాలనీ వాసులు తదితరులున్నారు.

ముథోల్‌లో ప్రారంభమైన పాఠశాలలు

● విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేత

ముథోల్, జూన్ 12: మండలంలోని ఆయా పాఠశాలలు బుధవారం పునః ప్రారంభమయ్యాయి.ప్రభుత్వ,ప్రైవేట్, రెసిడెన్షియల్ అన్ని రకాల విద్యాసంస్థలు తెరుచుకున్నారు. 48 రోజుల వేసవి సెలవుల అనంతరం పిల్లలు ఉత్సాహంగా బడి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు పంపిణీ ప్రారంభమైంది. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పుస్తకాలు పంపిణీ చేశారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

» ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..

» మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచకముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ.. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

చెరువు నుంచి అడ్డగోలుగా మొరం తరలింపు

- కొల్హారిలో దర్జాగా దందా.. ప్రభుత్వ ఆదాయానికి గండి
- అర్ధరాత్రి దాటాక దొంగచాటున తరలింపు
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు

బజార్‌హత్నూర్, జూన్12: మండల పరిధిలోని కొల్హారి గ్రామం వద్ద అంతర్రాష్ట్ర రహదారిపైన నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద అప్రోచింగ్ రోడ్డు కోసం ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గుత్తేదారు మొరం తరలించడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నాడని మండల వాసులు మండిపడుతున్నారు. దాదాపు రెండు కోట్ల నలభై లక్షల రూపాయల నిధులతో గుత్తేదారు బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించారు. బ్రిడ్జికు ఇరువైపులా అప్రోచింగ్ రోడ్డు కొరకు కావాల్సిన మొరంను గుత్తేదారు మైనింగ్ లేదా తహసీల్దార్ కార్యాలయంలో మొరం తరలింపునకు కావాల్సిన అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా.. సదరు గుత్తేదారు ఎటువంటి నిబంధనలు పాటించలేదు. దర్జాగా అక్రమంగా జాతర్ల శివారంలోని చెరువు నుంచి ఇరిగేషన్ డిపార్టుమెంటు నుంచి గానీ, మైనింగ్ డిపార్ట్‌మెంటు నుంచి గానీ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అర్ధరాత్రి సయంలో దొంగ చాటున అక్రమంగా మొరం తరలింపునకు సదురు గుత్తేదారు పాల్పడ్డారు. అనుమతులు లేకుండా గుత్తేదారు దర్జాగా మొరం తరలించడంతో అధికారు లతో మిలాకత్ అయి మొరం తరలిస్తున్నారనే గుసగుసలు మండలంలో మొదలయ్యాయి. ఇటీవల మండలకేంద్రంలోని చెరువులో రైతులు పొలాలకు వెళ్లే దారి వానాకాలంలో బురదమయంగ మారుతుండడంతో ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ఈ సంవత్సరం కూడా అటువంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు.. తల కొంత డబ్బులు జమ చేసుకుని పొలందారి బాగు చేసుకుందామని ట్రాక్టర్లతో మొరం తరలించారు. ఈవిషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు మరుసటి రోజే వచ్చి వారిని భయభ్రాంతులకు గురిచేయడంతో ట్రాక్టర్ల యజమానులు మొరం తరలింపును ఆపివేశారు. రైతులకు చెరువు నుంచి మొరం తరలింపునకు అనుమతులు కావాల్సి ఉన్నప్పుడు.. ఎక్కడి నుండో వచ్చిన కాంట్రాక్టర్ దర్జాగా జాతర్ల శివారంలోని చెరువు నుంచి పెద్దపెద్ద టిప్పర్లతో మొరం తరలిస్తున్నా.. ఇరిగేషన్ అధికారులు ఎందుకు స్పందించకుండా ఉన్నారని మండల రైతులు ప్రశ్నిస్తున్నారు.

● సెలవు రోజు, అర్ధరాత్రి మొరం తరలింపు

ప్రభుత్వ సెలవు రోజు, అర్ధరాత్రి వేళల్లో గుత్తేదారు దర్జాగా అక్రమంగా మొరం తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నాడని మండలవాసులు పేర్కొన్నారు. ఈ వారంలో వరుసగా రెండు రోజులు సెలవు రావడంతో మండల కేంద్రంలో ప్రభుత్వాధికారులు ఎవరూ ఉండరనే కారణంతోనే అక్రమ మొరం తరలింపునకు పక్కా ప్రణాళికతోనే గుత్తేదారు మొరం తరలించాడనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్మాణానికి సరిపడా నిధులు కేటాయించినప్పటికీ.. పెద్ద మొత్తంలో నిధులు మిగిల్చుకోవాలన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేందుకు గుత్తేదారు ప్రయత్నిస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని రకాల అనుమతులు తీసుకున్న తరువాతే మొరం తరలించుకునే విదంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


మొరం తరలింపుతో ఏర్పడిన భారీ గుంత

ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు

మండలం పరిధిలోని ఏ ఒక్క చెరువులో కూడా ఎవరికి అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు లేకుండా చెరువులలో మొరం తవ్వకాలు జరిపితే వాహనాలను సీజ్ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా అక్రమంగా మొరం తరలిస్తే వెంటనే మాకు సమాచారం అందిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- రాథోడ్ విఠల్ (ఇరిగేషన్ ఈఈ)


ప్రభుత్వ ఉపాధ్యాయుడి దారుణ హత్య


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

ఉట్నూర్, జూన్ 12: జైనథ్ మండలంలోని మేడి గూడ (కె) ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న గిరిజన ఉపాధ్యాయుడు జాదవ్ గజేందర్ (40) బుధవారం నార్నూర్ మండలంలోని అర్జుని కొలాంగూడ శివారులో దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు బండరాయితో తలపై బాది హత్య చేసినట్లు సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తోంది. ఘటన స్థలాన్ని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, నార్నూర్ సీఐ రహీం పాషా పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్నూర్ మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్ఐ జాదవ్ బిక్కు మూడో కుమారుడు జాదవ్ గజానంద్ జైనథ్ మండలంలోని మేడిగూడ(కె) గల జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత మూడేళ్లుగా ఆదిలాబాద్‌లో గది అద్దెకు తీసుకొని కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులకు స్వగ్రామమైన నాగల్ కొండకు కుటుంబ సమేతంగా రాగా.. పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో గ్రామం నుంచి ఉదయం 7గంటలకు బైకుపై గాదిగూడ మండలం లోకారి మీదుగా మేడిగూడ పాఠశాలకు బయల్దేరాడు. ఉదయం 7గంటలకు బయలుదేరిన జాదవ్ గజేందర్‌కు భార్య జాదవ్ విజయలక్ష్మి ఫోన్ చేయగా నెట్‌వర్క్ పరిధిలోకి రాలేదు. మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళనకు గురైన ఆమె తన మరిది కొడుకు సహాయంతో బైకుపై విధులు నిర్వహిస్తున్న పాఠశాలకు బయల్దేరగా అర్జుని కొలాంగూడ గ్రామ శివారులో ప్రధాన రోడ్డుపై బైక్ కనిపించిందని, అనుమానం రావడంతో చుట్టు వ్యవసాయ పొలంలో వెళ్లి చూడగా అక్కడ హత్యకు గురై విగత జీవితగా కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో ప్రాంతాన్ని తనిఖీ చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి జాదవ్ బిక్కు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● టీచర్ మృతి పై విచారణ జరిపించాలి

గజేందర్ టీచర్ మృతి పై న్యాయ విచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజేందర్ అనుమానస్పద మృతిపై ప్రభుత్వ పరంగా న్యాయ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు భుక్య రాజేశ్‌నాయక్, జిల్లా ఆదిలాబాద్ ఎస్పీని కోరారు.



'మిషన్ భగీరథ నీరు ప్రతీ ఇంటికి చేరేలా చర్యలు'

జైనథ్, జూన్ 12: మిషన్ భగీరథ నీరు ప్రతీ ఇంటికి చేరేలా చర్యలు చేపడుతున్నట్లు జైనథ్ మండల ప్రత్యేక అధికారి సాంబశివరావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన జైనథ్‌లో ఐకేపీ సీసీల ఆధ్వర్యంలో ఇంటింటా మిషన్ భగీరథ నల్లనీరు అనే సర్వేను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జైనథ్ ఎంపీడీఓ రవీంద్రనాథ్ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చంద్రశేఖర్, మిషన్ భగీరథ పథకం అధికారులు, ఐకేపీ సీసీలు, తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ దశలో ఉన్న కోర్టా-చనాక బ్యారేజీ

పెండింగ్ బ్యారేజీ!

- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని కోర్టా - చనకా పనులు
- అడుగు ముందుకు పడని సాగునీటి కాల్వల నిర్మాణం
- అంచనా వ్యయం పెంచినా నిధుల విడుదలలో తీవ్ర జాప్యం
- ఆయకట్టు రైతులకు తప్పని ఎదురుచూపులు
- ఇక కొత్త ప్రభుత్వం పైనే కోటి ఆశలు

ఆదిలాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన కోర్టా-చనకా పెండింగ్ బ్యారేజీగానే మారిపోయింది. ఏళ్లు గడుస్తున్నా ఎకరం ఆయకట్టును తడిపిన దాఖలాలు కనిపించడం లేదు. జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నదిపై కోర్ట-చనాక బ్యారేజీ నిర్మాణ పనులకు అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. గత ఎనిమిదేళ్ల క్రితం 2016లో రూ.386కోట్ల అంచనా వ్యయంతో కోర్ట-చనాక బ్యారేజీ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. అయినా ఇప్పటివరకు పనులు ఆగుతూ సాగుతున్న ముందుకు పడడంలేదు. ఈ బ్యారేజీ పనులు పూర్తయితే ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల్లోనే 50వేల ఎకరాలకు పైగా సాగునీరు అందే అవకాశం ఉంది. ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఇప్పటికే ఏడు సార్లు పనులను పూర్తి చేసేందుకు గడువు సమయాన్ని పొగడించినా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదు. ప్రతీయేటా పెన్‌గంగా నదికి భారీ వరదలు రావడంతో పనులు అర్థంతరాంగానే నిలిచిపోతున్నాయి. గత యేడు హత్తి ఘాట్ పంపు హౌస్ పనులను పూర్తి చేసి వెట్‌రన్ నిర్వహించిన చుక్క నీరు ఆయకట్టుకు అందించడం లేదు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి పెన్‌గంగా భవనాన్ని పూర్తి చేసిన అధికారులు బ్యారేజి నిర్మాణ పనులను పూర్తి చేయకపోవడంతో అన్నదాతల పాలిట శాపంగా మారుతోంది. ఈ యేడు మళ్లీ వానాకాల సీజన్ ప్రారంభమైన ఆయకట్టుకు సాగునీరు అందడం గగనంగానే మారుతోంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా కోర్టా - చనకా బ్యారేజీపై ప్రత్యేక దృష్టిని సారించి ఆయకట్టుకు సాగు నీటిని అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

భూ సేకరణకు నిధులు కరువు

దాదాపుగా కోర్టా - చనకా బ్యారేజీ నిర్మాణం పనులు పూర్తయినా భూసేకరణ చేపట్టక పోవడంతో సాగునీటి కాలువల నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. గత రెండు మూడేళ్లగా భూసేకరణకు సంబంధించిన నిధుల విడుదలలో ప్రభుత్వం జాప్యం చేస్తూ వస్తోంది. పనులు చేపట్టేందుకు వేసవికాలం అనుకూలంగా ఉన్న ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. మళ్లీ వర్షాకాలం ముంచుకు రావడంతో పనులు చేపట్టే పరిస్థితి లేదంటూ అధికారులు చేతులేత్తేస్తున్నారు. అసలే నల్లరేగడి నేలలు కావడంతో చిన్నపాటి వర్షాలకే బురదమయమై పనులకు ఆటంకాలు ఏర్పడుతాయి. గత రెండు మూడేళ్లగా ప్రధాన కాలువలతోపాటు ఉప కాలువల పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ యేడు కూడా ఆయకట్టుకు సాగునీరు అందించలేమంటూ అధికారులు చెబుతున్నారు. కనీసం హత్తిఘాట్ పంపుహౌజ్‌తోనైనా అందినకాడికి సాగునీటిని ఇవ్వాలని కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావిడి చేసిన అధికారులు ఆ తర్వాత ఆ విషయాన్నే పూర్తిగా మరిచి పోయారు. వర్షాకాలం ముగిసిన తర్వాత కాలువల నిర్మాణం పనులను చేపట్టిన యేడాదికి పైగానే సమయం పట్టే అవకాశం ఉందంటున్నారు.

కనిపించని పురోగతి

కోర్టా చనకా బ్యారేజీ నిర్మాణం పనులను అనుకున్న గడువులోగానే పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీరు అందించాలని గత ప్రభుత్వం లక్ష్యం పెట్టుకున్న అది సాధ్యం కాలేదు. అంచనా వ్యయాన్ని పెంచిన పనుల్లో పురోగతి కనిపించ లేదు.గత ప్రభుత్వం గరిష్ఠంగా రూ.765 కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచుతూ రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక జీఓను జారీచేసింది. అయిన ఒక్క రూపాయి కూడా విడుదల చేయక పోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. పదేళ్ల పాలనలో జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేక పోయింది. ఇప్పటి వరకు కోట్ల రూపాయల నిధులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టా - చనకా బ్యారేజీకి సంబంధించిన నివేదికలు తీసుకున్న ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికే పూర్తయిన పనులు నిరుపయోగంగా మారాయి. కనీసం అధికారుల పర్యవేక్షణ కూడా లేకుండానే పోతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. అడ్డగోలుగా అంచనాలు పెంచిన దాననుగుణంగా నిధులను విడుదల చేయక పోవడంతోనే పనులు నిలిచి పోయాయంటూ పేర్కొంటున్నారు. సాగునీటి కాల్వల నిర్మాణం పనులను చేపట్టేందుకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్ట్ కంపెనీలు వెళ్లి పోవడంతో మళ్లీ టెండర్లను పిలవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంత మేరకు నిర్మించిన కాలువల సిమెంట్ పనులు శిథిలాలుగా మారుతున్నాయి. పలుచోట్ల పగుళ్లు తేలి కనిపిస్తున్నాయి. కాలువల్లో భారీగా పూడిక చేరి అసలు కనిపించకుండానే పోతున్నాయి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..

• రవీందర్ (ఈఈ, పెన్‌గంగ బ్యారేజీ)

కోర్టా - చనకా బ్యారేజి నిర్మాణ పనుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే హత్తిఘాట్ పంప్‌హౌజ్ వెట్‌రన్ విజయవంతంగా పూర్తి చేశాం. ఈయేడు కాలువలు పూర్తయిన వరకు రైతుల డిమాండ్‌ను బట్టి సాగునీటిని అందించే అవకాశం ఉంటుంది. కాల్వల కోసం భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. ఇందుకు సంబంధించిన పూర్తి నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తాం. వర్షాకాలంలో బ్యారేజీ పనులు చేపట్టేందుకు అనువైన సమయం కాదు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే పంప్‌హౌజ్ ద్వారా నీటిని ఎత్తి పోసి ఆయకట్టుకు సాగునీటిని అందిస్తాం.

పాఠశాలల పునర్నిర్మాణానికి ప్రత్యేక నిధులు

• మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్



నోట్ పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్మన్

ఆదిలాబాద్‌అర్బన్, జూన్ 12: బీఆర్‌ఎస్ హయాంలో మన ఊరు మనబడి, మనబస్తీ మనబడి పథకాలతో పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ఉన్నత విద్యను ప్రోత్సహిస్తున్నామని మున్సిపల్ చైర్మన్‌జోగుప్రేమేందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని వార్డునెంబర్ 49 భుక్తాపూర్‌లోని ప్రైమరీ స్కూల్లో బడిబాట కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్‌తో కలిసిచైర్మన్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు దుస్తులను ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాలతో కూడిన బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలోడీఈవో ప్రణిత, డీఎస్‌డీవో వెంకటేశ్వర్లు, కమిషనర్ ఖైమద్, సిబ్బంది ఉన్నారు.

• వ్యర్థాలను ట్రాక్టర్‌లోనే వేయాలి

వ్యర్థాలను పక్కన పాడేయకుండా మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మసీదు సదరులు, హిమామ్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. వ్యర్థాలను మున్సిపల్ ట్రాక్టర్లకు మాత్రమే అందించాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్న మున్సిపల్ సిబ్బందికి తెలపాలని సూచించారు. ప్రతీయేటా లాగే ఈసారి కూడా బక్రీద్ పండుగకు పూర్తిఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్ రంజాన్, మున్సిపల్ కమిషనర్ కమర్‌ఖైమద్, మౌలానాతో పాటు హిమాంలు, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

పాఠశాలల పున:ప్రారంభం

• తొలి రోజే విద్యార్థులకు యూనిఫాంల అందజేత

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 12: వేసవి సెలవుల అనంతరం ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా బుధవారం పాఠశాలలు గురువవారం పున:ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఆయాపాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు. పాఠశాల ఆవరణలో ముగ్గులు వేసి తోరణాలు కట్టి బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు. సెలవుల అనంతరం స్నేహితులను కలుసుకోవడంతో విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. అనంతరం బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు తొలిరోజునే యూనిఫాంలను అందించి ఘన స్వాగతం పలికారు.

సంక్షిప్త సమాచారం

చిరుత సంచారం

సోనాల, జూన్ 12: మండలంలోని టీవీటీ గ్రామ సమీపాన మంగళవారం రాత్రి 8గంటల ప్రాంతంలో బోథ్ నుంచి సోనాల వెళ్లే రోడ్డులో వెళ్తున్న ప్రయాణికులకు చిరుతపులి కన్పించినట్లు సమాచారం. సమీపంలోని టీవీటీ, డీపల్లె గ్రామస్థులు చిరుత సంచారం పట్ల భయాందోళనకు గురవుతున్నారు. అటుగా వెళ్లే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని చెప్తున్నారు.

• ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బోథ్: రేంజ్ పరిధిలోని టీవీటీ అడవులలో చిరుత పులి సంచరిస్తోందని, అయితే చిరుత వర్ధర్ అడవుల వైపు వెళ్లిందని డిప్యూటీ రేంజ్ అధికారి సుందర్ తెలిపారు. చిరుత పాదముద్రలను గుర్తించామని, మంగళవారం రాత్రి మహారాష్ట్ర వైపు వెళ్లిపోయిందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

• ట్రాన్స్‌కో ఎస్ఈ జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్‌అర్బన్, జూన్12: విద్యుత్ సమస్యలపై వచ్చిన అర్జీలను క్షుణంగా పరిశీలించి వెంటనే పరిష్కారం అయ్యేలా కృషిచేస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ జేఆర్ చౌహాన్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో వినియోగదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు వారి సమస్యలను ఎస్ఈకు తెలుపుతూ వినతులను అందించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఫిర్యాదుల విభాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికి ఎర్తింగ్ పెట్టుకోవాలని, లేనిపక్షంలో కరెంట్ షాక్‌లకు గురవుతారన్నారు. విద్యుత్ సమస్యను ప్రైవేట్ వ్యక్తులతో చేయించొద్దని సూచించారు. ఇందులో అకౌంట్ ఆఫీసర్ డి.శంకర్, అసిస్టెంట్ డీఈ శివప్రసాద్, ఏఏఓ కె.ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

భీంపూర్, జూన్12: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని భీంపూర్ ఎంపీపీ కుడిమేత రత్నప్రభ సంతోష్ అన్నారు. బుధవారం భీంపూర్ మండలంలోని బెల్సారిరాంపూర్‌లో పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా బడిబాటలో విద్యార్థులకు యూనిఫామ్స్, బుక్స్‌లను పంపిణీచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బక్కి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సాయి, తదితరులు పాల్గొన్నారు.

• పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

జైనథ్: తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని జైనథ్ ఎంపీపీ ఎం.గోవర్ధన్ అన్నారు. బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన జైనథ్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లతోపాటు ఏకరూప దుస్తులను అధికారులు నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైనథ్ మండల జడ్పీటీసీ తుమ్మల అరుందతివెంకట్‌రెడ్డి, ఎల్.కరుణాకర్‌రెడ్డి, జైనథ్ మండల ప్రత్యేక అధికారి సాంబశివరావ్, ఎంఈఓ జి.శ్రీనివాస్, ఎంపీడీవో రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి: కలెక్టర్



విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి, జూన్12: బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ రాజర్షిషా కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలకేంద్రంలోని బుద్దానగర్ ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాల-1లో చేపట్టిన బడిబాట కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులతోపాటు పాఠ్య పుస్తకాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాలైన మౌలిక వసతులు ఉన్నాయని ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ మధ్యాహ్నభోజనం, అల్పాహారం, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని వాటిని సద్వినియోగపరచుకోవాలని కోరారు. 19వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వం త్వరలో స్కిల్ యూనివర్సిటీని ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లాలో 1108 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ఏకరూప దుస్తులు కుట్టినందుకు వీరికి రూ.50 నుంచి 75వరకు పెంచినట్లు తెలిపారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలలపై నమ్మకం ఉండేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యనందిం చాలన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని గుర్తుచేసుకున్నారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌తో కలిసి పాఠశాల గదులు, టాయిలెట్స్‌లను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రత్తివార్ కృషికేంద్రం విత్తన షాపును తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వార్డెన్ పర్వేజ్

పోస్టుమెట్రిక్ వసతి గృహాన్ని సద్వినియోగించుకోవాలి

బజార్‌హత్నూర్, జూన్12: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న బీసీ పోస్టుమెట్రిక్ బాలుర వసతిగృహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హాస్టల్ వార్డెన్ పర్వేజ్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, మరియు మోడల్ కాలేజ్‌లలో విద్యనభ్యసించే కళాశాల బాలురకు వసతిగృహంలో చదువుకునేందుకు అవసరమైన నోట్‌బుక్స్, లైబ్రరీ సౌకర్యం, భోజన వసతి, స్టడీఅవర్స్, కాంపిటేటివ్ ఎక్సామ్స్‌కు సంబంధించిన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే

బజార్‌హత్నూర్, జూన్ 12: మండలం పరిధిలోని 30 గ్రామపంచాయతీలలో మిషన్ భగీరథ సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ నీరు ప్రతీరోజు వస్తుందా, తాగునీరుగ ఉపయోగించుకుంటున్నారా.. ఇబ్బందులు ఏమన్నా ఉన్నాయా అంటూ ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఇంటికి యజమానులకు అడిగిన తర్వాతే వారి సమాధానాలను తమ రికార్డులలో పొందుపరుస్తున్నారు. ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని సర్వేకు వచ్చిన అధికారులు పేర్కొంటున్నారు.



సర్వే నిర్వహిస్తున్న పీఎస్ సునీల్‌రెడ్డి

పట్టుదలతో కృషి చేస్తే మంచి భవిష్యత్తు: ఎమ్మెల్యే

ఉట్నూర్, జూన్12: విద్యార్థులు పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని పీఎంఆర్సీ భవనంలో ట్రైబల్ వెల్ఫేర్ బెస్ట్ అవెలేబుల్ పాఠశాలలో విద్యార్థుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృషిపట్టుదల కష్టపడేతత్వం ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల పాఠశాలల, ట్రైబల్, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల అభివృద్ధి కృషి చేస్తుందన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నట్ల తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ డీడీ దిలీప్‌కుమార్, ఏటీడీవో క్రాంతికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

• బడిబాటలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఉట్నూర్ మండలంలోని లక్కారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, జడ్పీటీసీ చారులత, ఎంపీపీ జైవంత్‌రావులతో కలిసి విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను ప్రతీఒక్కరు ప్రభుత్వ పాఠశాలలకు పంపించాల న్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజన్న, శామ్యూల్, ఏపీఎం అనిల్, కుంర శ్రీనివాస్, అలాకుమార్, కలీం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాంలు అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: ఎంపీ

ఆదిలాబాద్ అర్బన్, జూన్12: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషిచేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో పట్టణంలోని మహాలక్ష్మివాడలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠ శాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులను కేటాయిస్తోందని అన్నారు. ప్రభుత్వపాఠశాలలు పేదల పాలిట వరాలుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు కావాల్సిన యూనిఫాంలో పుస్తకాలు, ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రతీ పాఠశాలల్లో ప్రత్యేకల్యాబ్‌లను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. మహాలక్ష్మివాడ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలో 9.0 జీపీఉత్తర్ణత శాతం సాధించిన విద్యార్థులను ఎంపీ, ఎమ్మెల్యేలు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఇందులో విద్యాశాఖ అధికారి ప్రణిత, మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్, నాయకులు మహేందర్, ఆదినాథ్, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

బడిబాటలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, జూన్12: మండలంలోని వడూర్ గ్రామంలో నిర్వహించిన బడిబాటకు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు యూనిఫాంలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిబాటలో పాల్గొనడం పిల్లలతో కలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వడూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన పద్మావతి, హర్షిత, శ్రీనిదిలు ఇటీవల జరిగిన 10వ తరగతి పరీక్షలో 9.0శాతం ఉత్తీర్ణత సాధించారనివారికి ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సజన్, నాయకులు తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీఓ రాజ్‌వీర్,ఎంఈఓ భూమారెడ్డి, అధికారులు పోషకులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

ఇచ్చోడ, జూన్12: మండలంలోని వివిధ పాఠశాలలకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు స్థానిక ఎమ్మార్సీ భవనానికి చేరాయి. ఈ పుస్తకాలను మండల విద్యాధికారి ఉదయ్‌రావ్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 77 పాఠశాలలకు గానూ ఇప్పటివరకు 10 పాఠశాలలకు దాదాపు 3010 పుస్తకాలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది సీసీఓ సురేష్, సీఆర్‌పీ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

భీంపూర్, జూన్12: మండలంలోని అంతర్‌గాం పాఠశాలలో బుధవారం అమ్మఆదర్శ పాఠశాలకమిటీ, హెచ్‌ఎం సంయుక్తంగా చేపట్టిన పాఠశాలలోని మరమ్మతులో భాగంగా రూ.6.20 లక్షలతో చేపట్టిన వాటర్ ట్యాంకు, టాయిలెట్‌లను ప్రారంభించారు. అనంతరం బడిబాట కార్యక్రమంలో జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.